ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
గురువారం 29 ఆగస్టు 2024



'రెడ్‌క్రాస్'లో తలసేమియా బ్లాక్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కలెక్టర్లు, అధికారులు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి



భద్రకాళి దేవాలయంలో గవర్నర్ పూజలు

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుతో పాటు సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలని అప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడిజిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించిన ఆయన లక్నవరం టూరిజం కాటేజీలో బస చేశారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి హనుమకొండ చేరుకుని.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, అది సుస్థిరమైనప్పుడే ఆశించిన ఫలితాలు దక్కుతాయని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. అధికారుల కర్తవ్య నిర్వహణ ఈ దృష్టి కోణం నుంచే జరగాలని ఉద్బోధించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, జలవనరులను కాపాడుకోవడం, వ్యర్థాల నుంచి పునరుత్పాదకత సాధన, ఇంధన వనరుల పొదుపు వాడకం వంటి వాటి ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. పీఎం కుసుమ్ యోజన పథకం గురించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ పథకం అమలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అందుకు కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటిపారుదల రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని పెంచాలని గవర్నర్ జిష్ణు దేవ్ కోరారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తోందని, ఈ క్రమంలో విద్యుత్ వాడక భారాన్ని తగ్గించేందుకు రైతులు కుసుమ్ యోజన పథకం కింద సౌర విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసే దిశగా కృషి జరగాలని గవర్నర్ సూచించారు. ఎస్‌హెచ్‌జీలను మరింత క్రియాశీలకంగా మార్చడం స్వచ్ఛభారత్‌లాగా ఒక ఉద్యమంలాగా సాగాలన్నారు. కొన్ని ఈ కామర్స్ సంస్థల వల్ల ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులు మార్కెట్‌లో పోటీని తట్టుకొని నిలబడలేకపోతున్నాయని, ఈ క్రమంలో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల మార్కెట్ విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తుల విక్రయానికి హైదారాబాద్‌లో ఒక విశాలమైన మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని గవర్నర్‌కు వివరించారు.

- అప్పుడే అసలైన ప్రగతి సాధ్యం
- వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించాలి
- మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి
- ఎస్‌హెచ్‌జీలను బలోపేతం చేయాలి
- ఓరుగల్లు విశిష్టమైన నగరం
- కాకతీయుల కట్టడాల సందర్శనతో దివ్యానుభూతి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- నగరంలో విస్తృత పర్యటన
- కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, కళాకారులతో భేటీ
- సంక్షేమ పథకాల అమలుపై ఆరా
- హాజరైన మంత్రులు పొంగులేటి, సీతక్క, పొన్నం ప్రభాకర్

అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య.. రెండు జిల్లాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, జరుగుతున్న పనులు, విద్య, వైద్యం, ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి, ఐసీడీఎస్, వ్యవసాయం, ఏనుమాముల మార్కెట్ తదితర శాఖల గురించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణ విధానం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ పనులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విపత్తుల నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతిపాదిత కూరగాయల మార్కెట్లు, పారిశుధ్య

మిగతా 7వ పేజీలో..

వేయి స్తంభాల దేవాలయంలో..





కోటలో పేరిణీ నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సత్ప్రవర్తన ఉంటే రౌడీషీట్లు రద్దు

నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ శబరీశ్



సమీక్ష సమావేశంలో సూచనలు చేస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఆగస్టు 28: సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్ల రద్దుకు పునఃపరిశీలన చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ శబరీశ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. నిఘాను పటిష్ఠపరచాలని తెలిపారు. మాదక ద్రవ్యాలను తరలిస్తూ పట్టుబడితే నార్కోటిక్స్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెద్దఎత్తున సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నేర నిరూపణ, దొంగతనాలను నివారించడంలో సీసీ కెమెరాల ప్రయోజనాన్ని గుర్తించాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆర్థిక నేరాలు, దొంగతనాల బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో ఓఎస్డీ మహేష్ బి.గీతే, ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, అదనపు ఎస్పీ సదానందం, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్‌బీ సీఐ రాములు, ములుగు, పస్రా, ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు శంకర్, రవీందర్, శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, టీవీ.సూరి, హరీష్, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేశ్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

ములుగు మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు షురూ



రాజస్థాన్‌కు చెందిన మెడికల్ విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి సీతక్క

- ఏడు ఆలిండియా కోటా సీట్లు భర్తీ
- తొలి ప్రవేశం పొందిన రాజస్థాన్ విద్యార్థిని
- అభినందించిన మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 28: ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ మొదలైంది. ఈ విద్యా సంవత్సరానికి 50సీట్లు కేటాయించారు. మూడు దశల్లో కౌన్సెలింగ్ జరుగుతుండగా మొదటి దశలో ఆలిండియా కోటా కింద కేటాయించిన ఏడు సీట్లు భర్తీ అయ్యాయి. తొలి అడ్మిషన్ పొందిన రాజస్థాన్ రాష్ట్రంలోని గంగానగర్ జిల్లాకు చెందిన గౌరీ అనే విద్యార్థిని బుధవారం రిపోర్టు చేశారు. ఆమెను మంత్రి సీతక్క అభినందించారు. మిగిలిన 43 సీట్లను తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు కేటాయించగా రెండు దశల కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోతు మోహన్‌లాల్ తెలిపారు. వచ్చే నెలలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలుండగా అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రేమ్‌నగర్ వద్ద జిల్లా ఆస్పత్రి కోసం మూడు బ్లాకుల్లో జీప్లస్ వన్ భవనాల నిర్మాణం పూర్తిదశకు చేరుకుంది. మొదటి భవనంలో ఇప్పటికే తరగతి గదులు, విద్యార్థులు, బోధన సిబ్బందికి వసతి, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించారు. భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు ఏరియా వైద్యశాలను బోధన ఆస్పత్రిగా ఉపయోగించుకోనున్నారు.



ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల

రేపు 'దేవాదుల'కు మంత్రి ఉత్తమ్ రాక



ములుగు, ఆగస్టు 28: సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈనెల 30న ములుగు జిల్లాకు రానున్నారు. కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టు పంప్‌హౌస్, తుపాలకుగూడెంలోని సమ్మక్క బ్యారేజీని సందర్శిస్తారు. ఉదయం 9 గంటలకు దేవాదులకు హెలిక్యాప్టర్ ద్వారా చేరుకోనున్న మంత్రి ఈ రెండు ప్రాజెక్టులను పరిశీలించిన తర్వాత సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై పలు అంశాలను సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మంత్రి పర్యటన కోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

భూపాలపల్లి అదనపు ఎస్పీగా కిషన్



ఎస్పీ కిరణ్ ఖరేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 28: భూపాలపల్లి అదనపు ఎస్పీ (ఓఎస్డీ)గా బోనాల కిషన్ నియమితుల య్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీం తో కిషన్ బాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖరేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ అదనపు ఎస్పీ (ఓఎస్డీ)గా పని చేసి న భుజంగరావు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడు నెలల క్రితం అరెస్టు అయ్యారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈ క్రమంలోనే బోనాల కిషన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన ఈ ప్రాంతానికి సుపరిచితుడు. గతంలో ఇక్కడ కానిస్టేబుల్‌గా కూడా పని చేశారు. భూపాలపల్లి ఎస్సైగా, కాటారం డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం అదనపు ఎస్పీగా నియమితులై విధుల్లో చేరడంతో వివిధ వర్గాల నుంచి ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు జిల్లాలోని పోలీస్ అధికాలు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 28 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 2.59 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతుం డగా 85 గేట్లను ఎత్తి, అం తే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 3.90 మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవహిస్తున్నట్లు అధికా రులు తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



భూముల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కాటారం, ఆగస్టు 28: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ఇందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు.మండలంలో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఐటీడీఏ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి విద్యాసంస్థలను, పీహెచ్‌సీని, ప్రైవేట్ ఆస్పత్రులను పరిశీలించారు. సబ్ కలెక్టర్

మిగతా 8వ పేజీలో...

విష జ్వరంతో బీఆర్ఎస్ యువ కార్యకర్త మృతి



రాకేష్ (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 28: విష జ్వరంతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణ పరిధి ఖాసింపల్లికి చెందిన సిద్ధం రాకేష్ (27) వారం రోజుల క్రితం తీవ్ర జ్వరం బారిన పడ్డాడు. స్థానికంగా చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో రెండు రోజుల క్రితం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో రాకేష్ మృతి చెందాడు. రాకేష్ బీఆర్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా కొనసాగుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వీరాభిమాని. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

రోహిణి ఆస్పత్రిపై ఆరోపణలు నిరాధారం

వరంగల్ మెడికల్, ఆగస్టు 28: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను స్వాహా చేసినట్లు తమపై వచ్చిన ఆరోపణలను రోహిణి ఆస్పత్రి యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ క్రాంతిరావు, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ బోస్ బుధవారం విలేఖర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మధ్య తమ ఆస్పత్రిపై వస్తున్న కథనాలను, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2023 మే మాసంలోనే విచారణ అధికారులు తమ ఆస్పత్రిని సందర్శించారని, బిల్లులను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఆరోపణల్లో చూపబడిన బిల్లులు ఆస్పత్రికి సంబంధించినవి కాదని రికార్డుల ద్వారా స్పష్టం చేశామని తెలిపారు. అదే విధంగా ఆ బిల్లులో పేర్కొన్న రోగులు ఎవరూ ఆస్పత్రి అడ్మిట్ కార్డుల్లో లేరని విచారణ అధికారులకు స్పష్టం చేశామన్నారు. ఆ బిల్లులో చికిత్స చేసినట్లు చెబుతున్న వైద్యులు కూడా తమ ఆస్పత్రిలో ఏనాడు పనిచేయలేదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ ప్రజలందరూ ఇలాంటి ఆరోపణలు నమ్మవద్దని వారు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న రోహిణి ఆస్పత్రి యాజమాన్యం

పాడి గేదెలను అపహరించిన దొంగలు

మడికొండ, ఆగస్టు 28: పాడి గేదెలను దొంగలు అపహరించిన ఘటన కాజీపేట మండలం రాజీవ్ గృహకల్ప(కడిపికొండ) వద్ద జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ గృహకల్ప వద్ద కొంతకాలంగా షఫియుద్దీన్ అనే రైతు కాకతీయ గేదెల డైయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు డెయిరీ ఫామ్‌లోని రెండు పాడి గేదెలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న రైతు.. బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదుతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజబాబు బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకొని గేదెలను స్వాధీనం చేసుకుంటామని ఇన్‌స్పెక్టర్ కిషన్ స్పష్టం చేశారు.

కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు హైకోర్టులో చుక్కెదురు

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కాకతీయ యూనివర్సిటీ కేటగిరీ 1, 2 అడ్మిషన్లను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఆధారంగా ఇప్పుడున్న సీట్లను భర్తీ చేయడంపై హైకోర్టు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అడ్మిషన్లలో పారదర్శకత, లేదని కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థి చల్లా అమరేందర్‌రెడ్డి కోర్టుమెట్లెక్కారు ఆయన అప్పీల్‌తో స్పందించిన హైకోర్టు.. తమ తదుపరి ఉత్తర్వులు వెల్లడించే వరకు ఎలాంటి పీహెచ్‌డీ ప్రవేశాలు చేపట్టరాదని కరాఖండిగా హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, 2020-2021 ఏడాదిలో కేయూ అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఇప్పటివరకు ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలని కేయూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇది వివాదాస్పదమైంది, కేటగిరీ, 1, 2 అడ్మిషన్లలో పారదర్శకత లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో హైకోర్టు అడ్మిషన్లకు మోకాలడ్డటంతో కేయూలో చర్చనీయాంశమైంది. దీంతో విద్యార్థులు కేయూ దూర విద్య కేంద్రం ఎదుట ఆందోళనలు, దీక్షలు చేపట్టారు. అదే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి ఇచ్చిన హామీ మేరకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని వర్సిటీ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో అడ్మిషన్ల ప్రక్రియ సందిగ్ధంలో పడింది.

కేయూ డిగ్రీ పరీక్షల ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కేయూ బీఏ, బీకామ్, ఇతర రెగ్యులర్ కోర్సుల 2, 4 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 28శాతం, నాలుగో సెమిస్టర్‌లో 36 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు. డాక్టర్ ఎం.తిరుమలాదేవి, డాక్టర్ అసీం ఇక్బాల్, సమ్మయ్య, ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేయూ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

సంస్కృతికి చిహ్నాలు పురాతన ఆలయాలు

● వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ● రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాచీన ఆలయాలు చిహ్నాలుగా విరాజిల్లుతున్నాయని, కోట్లాది మంది ప్రజల హృదయాల్లో కొలువైన రుద్రేశ్వరుడిని దర్శించుకోవడం గొప్ప అనుభూతి కలిగించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మేయర్ గుండు సుధారాణి తదితర ప్రముఖులతో కలిసి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన గవర్నర్‌కు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠ శర్మ, ప్రణవ్‌శర్మ, ఇతర వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయానికి అభిముఖంగా ఉన్న శిల్పకళాశోభిత నందీశ్వరుడిని, ఉత్తిష్ఠ గణపతిని దర్శించి రుద్రేశ్వరుడి సన్నిధిలో శివ పంచాక్షరి మంత్రంతో బిల్వ దళార్చన చేశారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో వేద పండితులు గవర్నర్ ఇతర ప్రముఖులకు వేయిస్తంభాల ఆలయ సుందర చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ బృందం ఇటీవల పూర్తయిన కల్యాణ మండపం అందాలను, పురావస్తుశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా మీడియాతో గవర్నర్ మాట్లాడుతూ.. వేయిస్తంభాల గుడి లాంటి ఆలయాలను చరిత్ర మరుగున పడకుండా భవిష్యత్‌తరాల వారు తెలుసుకునేందుకు వీలుగా నిత్యనూతనంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయంలో శిల్పకళానైపుణ్యం అద్భుతమని, ఎందరో చిత్రకారులు, శిల్పులు అద్భుతంగా చెక్కిన రూపాలు అలనాటి కాకతీయుల ప్రతిభతో పాటు సమాజ శ్రేయస్సు చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సిరిసిల్ల రాజయ్య, ప్రొఫెసర్ పాండురంగారావు, హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, పురావస్తు శాఖ అధికారి మల్లేశం, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాల సునిత, ఈవో వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గవర్నర్ బృందం అరగంట పాటు ఉల్లాసంగా గడిపింది.



వేయిస్తంభాల ఆలయంలో శిల్పకళను పరిశీలిస్తున్న గవర్నర్



కల్యాణమండపం నందీశ్వరుడి వద్ద గవర్నర్..

భద్రకాళికి గవర్నర్ పూజలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 28: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని చరిత్రాత్మక కట్టడాలు, ఆలయాల సందర్శనలో భాగంగా బుధవారం సాయంత్రం భద్రకాళి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చక బృందం, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునీత స్వాగతం పలికారు. వేదమంత్రాలతో, మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత గవర్నర్ గణపతి స్వామిని దర్శించుకొని అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ప్రధానార్చకులు గవర్నర్‌కు అమ్మవారి కుంకుమధారణ చేసి శేషవస్త్రాలు అందజేశారు. మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, నగరమేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్వినితానాజీ వాకడేలకు అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు. ఈవో శేషుభారతి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అమ్మవారి చరిత్రను ప్రధానార్చకులు గవర్నర్‌కు ఆంగ్లంలో వివరించారు. అయితే షెడ్యూల్‌ప్రకారం గవర్నర్ సాయంత్రం 4గంటలకు దేవాలయానికి రావాల్సి ఉండగా 5గంటలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాలు ఆలయంలో గడిపారు. గవర్నర్ రాక సందర్భంగా దేవాలయాన్ని పూల మాలలతో అరటి బోదెలతో అలంకరించారు.



గవర్నర్‌కు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

దర్శనం అనంతరం ఖిలా వరంగల్ కోటకు వెళుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అనేక చారిత్రక కట్టడాలు, ఆలయాలు, అభివృద్ధిని తిలకిస్తున్నానని, ఆలయాల సందర్శనం, సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టతలను తెలుసుకుంటున్నానన్నారు.

అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది

భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, దేవాలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా కనిపిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రకాళి అమ్మవారి



భద్రకాళి ఆలయంలో గోశాల వద్ద గవర్నర్..

కాకతీయుల కట్టడాలను ముందుతరాలకు అందించాలి



కళాతోరణం వద్ద గవర్నర్, మంత్రులు

ఖిలావరంగల్, ఆగస్టు 28: కాకతీయుల అద్భుత కళాఖండాలు, కట్టడాలను ముందుతరాలకు అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం వరంగల్ మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కళాఖండాలు, కట్టడాలు, శిల్ప సంపదలను ఆసక్తిగా తిలకించారు. శిల్పాల ఆవరణలోని కాకతీయుల కీర్తితోరణం, రాతి కట్టడాలను తిలకించి పులకించారు. కీర్తితోరణం ముందు ఫొటోలు తీసుకున్నారు. అనంతరం స్వయంభూ - శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్‌కు కళాకారుడు గడ్డం సుధాకర్ బృందం బోనాలు, బతుకమ్మలు, కోలాటం డప్పుచప్పుళ్ల తదితర కళాకారుల నృత్యాలతో ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు స్వాగతం పలికారు. ఆవరణలో పేరిణి శివతాండవాన్ని గజ్జెల రంజిత్ బృందం, చిందు యక్షగానం గజవెళ్లి దామోదర్ బృందం, రాణిరుద్రమదేవి నృత్యప్రదర్శన సుధీర్‌రావు బృందం ప్రదర్శించింది. పెండ్యాల లక్ష్మీప్రియ బాలపురస్కార్ అవార్డు గ్రహీను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాకారులను శాలువాలతో సన్మానించారు. కోటలో గవర్నర్ పర్యటనలో భాగంగా స్పెషల్ పార్టీ, వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝూ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ బందోబస్తు

వరంగల్ కోట సందర్శనలో గవర్నర్

నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు వచ్చిన గవర్నర్ 7.10 వరకు కోటను సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతిరాజ్, శిశుసంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూర్య సీతక్క, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, కేంద్ర పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ హెచ్‌ఆర్ దేశాయ్, జిల్లా అధికారి మల్లేశం, పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నాయకులు వన్నాల వెంకటరమణ, కుసుమ కుతీష్, సీపీ అంబర్ కిషోర్ ఝూ, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.





ఖిలా వరంగల్ కోటలో పేరిణి నృత్య ప్రదర్శన

గవర్నర్‌కు స్వాగతం పలికిన కొండా

కోటకు వచ్చిన గవర్నర్‌కు మధ్యకోటలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఘనస్వాగతం పలికారు. బొకే ఇచ్చి, సత్కరించారు. 37,38 డివిజన్‌ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ-జనార్దన్ స్వాగతం పలికారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కొండా మురళీధర్‌రావు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం తదితర అంశాలను వివరించారు. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిని సీపీ అంబర్ కిశోర్ ఝూ వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధరంగాలకు చెందిన సుప్రసిద్ధ కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులతో గవర్నర్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వారితో ముచ్చటించారు.

వరంగల్ విశిష్ట నగరం

వరంగల్ అనేక ప్రాచీన దేవాలయాలు, వారసత్వ కట్టడాలు ఉన్న సుప్రసిద్ధ, చారిత్ర నగరమని, భవిష్యత్తులో మరింత సుస్థిరాభివృద్ధిని సాధించాలన్న ఆకాంక్షను గవర్నర్ వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తనకు తన ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం నగర విశిష్టత, చారిత్రక నేపథ్యం గురించి తెలిపారని, వ్యవసాయరంగంలోనూ జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నందుకు అధికారులను అభినందించారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా తాను ములుగులోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించానని, ఆస్పత్రి ఎంతో పరిశుభ్రంగా ఉండడం తనను ఆకట్టుకుందన్నారు. జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ స్వాగతించారు. కాకతీయులు ఏలిన గడ్డ ఓరుగల్లులో పర్యటించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంతా యువ అధికారులే ఉన్నారని, వీరి నేతృత్వంలో అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడి చారిత్రక కట్టడాలను చూసేందుకు ఈ జిల్లాలకు మరోసారి వస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలపై తనను స్వేచ్ఛగా కలవవచ్చునని, రాజ్‌భవన్ ద్వారాలు సదా తెరిచి ఉంటాయని గవర్నర్ స్పష్టం చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

హనుమకొండ, వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఎన్ఐటీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, సీపీ అంబర్ కిశోర్ ఝూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదా, కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డీఎఫ్‌వోలు అనుజ్ అగర్వాల్, లావణ్య, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పుష్పగుచ్ఛాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రజాప్రతినిధులతో గవర్నర్ కొద్ది సేపు సమావేశం అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా అభివృద్ధి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చారిత్రకంగా ఈ రెండు జిల్లాల ప్రాశస్త్యం గురించి ఆసక్తిగా ఆరా తీశారు.

సాంస్కృతిక కళా రంగంలో ఓరుగల్లు స్థానం అద్భుతం

ఉమ్మడి జిల్లా జిల్లా ప్రముఖులతో గవర్నర్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: తెలంగాణ ప్రాంతంలోనే సాహిత్య, సాంస్కృతిక కళారంగాల్లో ఓరుగల్లు స్థానం అద్భుతమని, భిన్నరంగాల ప్రముఖలను కలుసుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం ఉమ్మడి జిల్లాకు చెందిన భిన్న రంగాల ప్రముఖులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరిని పేరుపేరునా ప్రస్తావిస్తూ కళ, సాహిత్య ఇతర రంగాలలో వారి కృషిని ప్రశంసించారు. ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, రామా చంద్రమౌళి, డాక్టర్ లంక శివరామప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాసరావు, అన్వర్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత గడ్డం కేశవమూర్తి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవితో మాట్లాడారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు లోహిత్ కుమార్, జాతీయ నృత్యకళాకారిణులు వెంపటి శ్రావణి, కాట్రగడ్డ హిమాన్సీ, పేరిణి నృత్యాన్ని జాతీయస్థాయిలో ప్రదర్శిస్తున్న గజ్జెల రంజిత్‌కుమార్, నాటక రంగ ప్రముఖుడు వనం లక్ష్మీకాంతరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిరావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ శేషుమాధవ్, కాళీచరణ్, క్రీడారంగం నుంచి సారంగపాణి, ఎం.డి.అజీజ్‌ఖాన్, మహిళా శక్తి అవార్డు గ్రహీత కొంగ రజిని, సామాజిక రంగం నుంచి మండల పరశురాములు, చేనేత రంగం నుంచి జాతీయ అవార్డు గ్రహీత పిట్టల రాములు, తదితర 40 మంది ప్రముఖులను గవర్నర్ కలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.



రచయిత, కార్టూనిస్టు రమాదేవితో మాట్లాడుతున్న గవర్నర్

6న హాజరు కావాలని సీపీకి హైకోర్టు నోటీసులు

వరంగల్ క్రైం, ఆగష్టు 28: ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్ పెన్షన్ విషయంలో సీపీ అంబర్ కిషోర్ ఝూకు రెండు రోజుల కిందట హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన యాదాద్రి అనే కానిస్టేబుల్ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, అతడి భార్య సంతకం కావాలని కమిషనరేట్ అధికారులు సూచించారు.

కుటుంబ కలహాలతో యాదాద్రి భార్య కేసు వేసిందనే కారణంతో పెన్షన్ జారీ విషయంలో కమిషనరేట్ అధికారులు జాప్యం చేశారు. పెన్షన్ జాప్యం కావడంతో కానిస్టేబుల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో పెన్షన్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కమిషనరేట్ కార్యాలయం నుంచి స్పందన లేకపోడంతో కానిస్టేబుల్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. సీపీని కానీ, ఆయన తరఫున న్యాయవాది హాజరు కావాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, ఆగస్టు 28: హనుమకొండ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226049కు ఫోన్ చేయాలని కోరారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం, 2వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మణిషా శ్రవణ్ ఉన్నమ్ బుధవారం తీర్పుచెప్పారు. బాధితురాలికి రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ రామన్నపేటకు చెందిన బాలికను నమ్మించి వరంగల్ పట్టణ పాపయ్యపేట చమన్ ప్రాంతానికి చెందిన రామరూపుల ప్రభుచరణ్ చెట్ల పొదలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీన్ని గమనించిన బాలిక తల్లిదండ్రులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. నిందితుడిపై పోక్సో చట్టం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు ప్రభుచరణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల నగదు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీలు పి.రఘు, శ్రీనివాస్, లైజన్ అధికారి ఎం.వెంకటస్వామి సాక్షులను ప్రవేశపెట్టారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఎస్‌హెచ్‌వో టి.గోపి, ఏసీపీ డి.చంద్రయ్య వ్యవహరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మఠ్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2,911	2,700
పల్లికాయ (సూక)	6,300	5,400
పల్లికాయ (పచ్చిది)	4,000	3,000
కందులు	8,552	8,552
పెసళ్లు	6,252	2,552
పత్తి	7,560	5,000
పసుపు (కాడి)	12,459	10,000
పసుపు (గోల)	12,059	11,409
తేజ మిర్చి	12,000	8,000
తేజ ఏసీ	17,500	15,000
వండర్‌హాట్ ఏసీ	16,000	13,000
యూఎస్341 ఏసీ	14,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం

తెలుగు వర్సిటీకి పాల్కురికి పేరు పెట్టాలి

తెలంగాణ ఆదికవికి పట్టం కట్టడం చారిత్రక అవసరం

సాహిత్యంలో బహుజనులకు స్థానం కల్పించింది సోమనాథుడే

సీఎం రేవంత్‌రెడ్డికి సాహితీ వేత్తలు, కవుల విజ్ఞప్తి



పాలకుర్తి, ఆగస్టు 28 : తెలంగాణ ఆదికవి, బహుభాషా కోవిధుడు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడు. తెలుగు, సంస్కృతం, కన్నడం, మలయాళం, మరాఠీ, తమిళం లాంటి భాషల్లో ప్రావీణ్యం కలిగిన ఆయన తెలంగాణ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చి దేశ వ్యాప్తంగా పరిచయం అక్కరలేని కవిగా గుర్తింపు పొందాడు. అలాంటి కవికి స్వరాష్ట్ర ప్రభుత్వం పట్టం కట్టాల్సిన చరిత్రక అవసరం ఉందని సాహితీవేత్తలు, కవులు కోరుకుంటున్నారు. దేశ ప్రథమ కవుల్లో ఒకరైన 11వ శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడిది ప్రస్తుత జనగామ జిల్లా పాలకుర్తి ఆయన స్వగ్రామం. బసవ పురాణం, వృశాధిప శతకం, పండితారాధ్య చరిత్ర లాంటి అనేక ప్రాముఖ్య గ్రంధాలు రాశాడు. పాల్కురికి సోమనాథుడికి ఆయన రాసిన సాహిత్యంపై పాలక వర్గాలు అనేక దశాబ్దాలుగా శీతకన్ను చూపుతున్నాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన కవిగా నిర్లక్ష్యానికి అవహేళనకు, ప్రాంతీయతకు గురయ్యారు. అది నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆయనను కేవలం వీరశైవ సాహిత్యానికి పరిమితం చేసి చరిత్ర కారులు సాహిత్య వేత్తలు తీవ్ర అన్యాయం చేశారు. అనువాద కవులకిచ్చిన ప్రాధాన్యం స్వతంత్ర కవులకు ఇవ్వడం లేదన్న బలమైన విమర్శ ఉంది. సోమనాథుడు సకల ఆధిపత్యాలను తిరస్కరించిన తొలి తెలుగు కవి. అణగారిన తరగతులకు తీవ్ర వివక్షకు గురవుతున్న శ్రామిక జనాలకు సాహిత్యంలో స్థానం కల్పించిన విప్లవ కవి సోమనాథుడు. దేశీయతకు పట్టం కట్టి నూతన ఒరవడులకు జీవం పోశాడు. సంప్రదాయాలను కాలదన్ని సమానత్వం చాటి చెప్పాడు. సమాజ మార్పును ఆకాంక్షించాడు. ఆ రోజుల్లో అది విప్లవకరమైన పరిణామం. అలాంటి సోమనాథుడి సమగ్ర సాహిత్యాన్ని విస్తృతంగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఆగస్టు 2న అసెంబ్లీలో సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి అందరూ ఆమోదం తెలిపితే తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రతాపరెడ్డి పేరు పెడతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొన్ని వర్గాల నుంచి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలని ప్రతిపాదనలు వచ్చాయి. పాలకుర్తికి చెందిన సోమనాథ కళాపీఠం లాంటి సంస్థ స్పందించి పాలమూరు విశ్వవిద్యాలయానికి లేదా మీడియా అకాడమీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును సూచించింది. అయితే ఈ కాంక్ష ఇప్పటిది కాదని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఆదికవిగా పాల్కూరికి సోమనాథుడిని గుర్తించాలని ఈ ప్రాంతానికి చెందిన మేధావులు, కవులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సోమనాథుడి పేరు పెట్టాలి

మామిండ్ల రమేష్‌రాజా, కవి, రచయిత పాలకుర్తి,



తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలి. స్వరాష్ట్రంలో పాలకులు పెడుతారని తెలంగాణ ఉద్యకారులు, సాహితీ వేత్తలు, ఆశించారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం కాలం పూర్తయినప్పటికీ పట్టించుకున్న పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా తెలుగు యూనివర్సిటీకి పాల్కురికి సోమనాథుడి పేరు నామకరణం చేస్తే సముచిత గౌరవం ఉంటుంది.

ఇతర వ్యక్తుల పేర్లు పెడితే తప్పిదం జరిగినట్లే

వీరమనేని వెంకటేశ్వర్‌రావు,

సోమనాథ కళాపీఠం బాధ్యుడు, పాలకుర్తి



హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఇతర వ్యక్తుల పేర్లు పెట్టినట్లయితే ఉమ్మడి పాలకులు చేసిన తప్పిదాన్ని కొనసాగించినట్లే అవుతుంది. తెలంగాణ ఆది కవి, తొలి తెలుగు స్వతంత్ర కవి, విప్లవ కవి పాల్కురికి సోమనాథుడి పేరు మాత్రమే సమంజసమైంది.

సోమనాథుడి పెరు పెట్టడమే సమంజసం

రాపాక సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పాలకుర్తి



తెలుగు విశ్వవిద్యాలయానికి బసవపురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టడమే సరైన నిర్ణయం. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న యూనివర్సిటీలకు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలి. బడుగు వర్గాల కష్టాలను సాహిత్యంలో స్థానం కల్పించిన సోమనాథుడికే ఆ పట్టం దక్కాలి.

ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటా

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ● లక్నవరం చెరువులో బోటింగ్

గోవిందరావుపేట, ఆగస్టు 28: ములుగు జిల్లాలోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని, త్వరలోనే ఇందుకు సంబంధించి ప్రకటన వెలువడుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని బుస్సాపూర్ సమీప లక్నవరం చెరువులోని ఐలాండ్‌లో ఉన్న టూరిజం కాటేజీలో గవర్నర్ బసచేశారు. బుధవారం ఉదయం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జ్ఞాపికను అందించి సత్కరించారు. జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని వినతిపత్రం సమర్పించారు. గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలి పర్యటనకు ములుగు జిల్లాను ఎంపిక చేసుకొని రోజంతా కేటాయించడం పట్ల సీతక్క ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి గవర్నర్ చెరువులో బోటింగ్ చేశారు. గవర్నర్ పర్యటన ప్రశాంతంగా జరిగిందని, ఈపరిణామం ములుగు ప్రగతిపై ప్రభావం చూపుతుందని ఆశిస్తున్నామని సీతక్క అన్నారు. గవర్నర్ టూర్‌కు సహకారమందించిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మీడియాకు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్‌లు పి.శ్రీజ, సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాత్రంతా పోలీసుల గస్తీ

చుట్టూ ఎత్తైన గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం మధ్యలో విస్తరించిన చెరువులోని దీవిలో బసచేసిన గవర్నర్‌కు జిల్లా పోలీసులు పటిష్టమైన భద్రత కల్పించారు. ప్రత్యేక పోలీసు బలగాలతో రాత్రంతా గస్తీకాశారు. సాయుధులైన జవాన్లు బోట్లలో చెరువు నలువైపులా తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎట్టకేలకు గవర్నర్ పర్యటన విజయవంతం కావడంతో పోలీసు శాఖ ఊపిరిపీల్చుకుంది. రెండురోజులుగా సాధారణ పర్యాటకుల సందర్శనను నిలిపివేయగా.. గవర్నర్ తిరుగు ప్రయాణమైన తర్వాత అందరినీ అనుమతించారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న మంత్రి సీతక్క



లక్నవరం చెరువులో బోటు షికారు చేస్తున్న గవర్నర్, మంత్రి, అధికారులు

గవర్నర్ టూర్ సక్సెస్

ములుగు, ఆగస్టు 28: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు జిల్లా పర్యటన విజయవంతమైంది. మంగళవారం ఉదయం 11.30గంటలకు జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన బుధవారం ఉదయం 10గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. 800 మంది పోలీసు సిబ్బందితో అడుగడుగునా భద్రత కల్పించిన ఆ శాఖ అధికారులు గవర్నర్ టూర్ ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి లక్నవరం చెరువులోని టూరిజం కాటేజీలో బసచేసిన గవర్నర్ బుధవారం ఉదయం జిల్లా కేంద్రానికి వచ్చారు. రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను సందర్శించారు. మంగళవారం వెంకటాపూర్ మండలంలోని రామప్ప పరిసరాల్లో బందోబస్తు విధుల్లో పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ ప్రశాంత్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్సపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు మోహన్‌లాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో రోగులను పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం హనుమకొండకు బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ గీతే, అదనపు కలెక్టర్‌లు శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను ప్రమోట్ చేసిన మంత్రి సీతక్క

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు టూర్‌ను మంత్రి సీతక్క సద్వినియోగం చేసుకున్నారు. పర్యటన ఆద్యంతం ఈప్రాంత భౌగోళిక ప్రత్యేకతలు, గొప్పదనాన్ని ప్రముఖంగా వివరించారు. ఇదే సమయంలో ఆర్థికంగా వెనుకబాటుకు గురైన పరిస్థితిని తెలియజేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ములుగు సమగ్ర స్వరూపాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ ముందుంచారు. ఈనేపథ్యంలో జిల్లాలోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ఆయన ప్రకటించారు. మంత్రి చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రొటోకాల్‌ను పక్కాగా అనుసరించిన సీతక్క మంగళవారం ఉదయం స్వాగతం పలకడం నుంచి బుధవారం వీడ్కోలు వరకు ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనడమే కాకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. లక్నవరంలో గవర్నర్ బసచేసిన కాటేజీ దాకా తోడ్కొని వెళ్లిన సీతక్క బుధవారం ఉదయమే అక్కడికి వెళ్లి చెరువు సందర్శనలో భాగస్వాములయ్యారు. ఆదివాసీల జీవన విధానాన్ని ప్రతిబింబించే చిత్రపటాలు, జ్ఞాపికలను బహూకరించారు. కొమ్ము, డోలు, గుస్సాడి, ధింసా నృత్య కళాకారులతో స్వాగతం పలికారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు జాతీయ పండుగ హోదా కల్పించేలా, పర్యాటకాభివృద్ధికి కేంద్రం ద్వారా నిధులు కేటాయించేలా చొరవ తీసుకోవాలని గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు.

బాధిత కుటుంబాలకు మంత్రి సీతక్క పరామర్శ

గోవిందరావుపేట, ఆగస్టు 28: మండలంలోని కోటగడ్డ గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతుండగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని బండ యాదిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమెవెంట కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు ఉన్నారు.

4న జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక పోటీలు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 28: జిల్లా స్థాయి అథ్లెటిక్ ఎంపికా పోటీలు సెప్టెంబర్ 4న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో అండర్ 14-20 పోటీలు జరుగుతాయని తెలిపారు. 60 మీటర్ల పరుగుపందెం మొదలుకొని 10కిలో మీటర్ల వరకు పోటీలు ఉంటాయని వివరించారు. అలాగే లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, క్రీడలు కూడా ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9885146117ను సంప్రదించాలని సూచించారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



అధికారులకు పలు సూచనలు చేస్తున్న కలెక్టర్ దివాకర

కన్నాయిగూడెం, ఆగస్టు 28: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈనెల 30న పర్యటించనున్న నేపథ్యంలో దేవాదుల ఇన్‌టేక్‌వెల్, సమ్మక్కసాగర్ బ్యారేజీ వద్ద ఏర్పాట్లను కలెక్టర్ దివాకర బుధవారం పరిశీలించారు. బ్యారేజీ వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని తదితర ప్రదేశాలను సందర్శించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంత్రి పర్యటన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తుపాకులగూడెం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, ఈఈ జగదీశ్, డీఈ లు ప్రవీణ్, శరత్‌బాబు ఉన్నారు.

తప్పుడు సమాచారంతో వీడియో పోస్టు చేసిన ఇద్దరిపై కేసు

మల్హర్, ఆగస్టు 28 : వీడియో ప్రచారం చేసి ప్రజల్లోకి తప్పుడు సమాచారం తీసుకెళ్లారనే ఆరోపణల నేపథ్యంలో మండలంలోని ఇదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కొయ్యూర్ ఇటుకల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన నరేంద్ర మోజె ఈనెల 20న ఆత్మహత్య చేసు కున్నాడు. అతడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. శవాన్ని ఒడిశాకు తీసుకెళ్లే స్తోమత లేక తండ్రి, కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోలీసులు, గ్రామస్థుల సమక్షంలో 21న కొయ్యూర్ గ్రామ శివారులో అంత్యక్రియలు జరిగాయి. మృతదేహాన్ని ఖననం చేసినప్రదేశం వద్ద మండలానికి చెందిన ఇద్దరు ఆకతాయిలు వీడియో తీశారు. మర్డర్ చేసి శవాన్ని పాతి పెట్టారని తప్పుడు సమాచారంతో వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి



నర్సింహ స్వామి (ఫైల్)

కాటారం, ఆగస్టు 28: మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో 353(సీ) జాతీయ రహదారిపై సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలపాలైన ఎల్లండి నర్సింహస్వామి(36) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన నర్సింహస్వామి భూపాలపల్లిలో ఉంటూ టవర్‌లైన్ పనులు చేస్తున్నాడు. బైక్‌పై ఇంటికి వచ్చి భూపాలపల్లికి తిరిగి వెళ్తుండగా రోడ్డుపై విరిగిపడ్డ కొమ్మను ఢీకొని కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో భూపాలపల్లికి ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింహస్వామి మృతి చెందాడు.

నిబంధనలు పాటించని ఇసుక కాంట్రాక్టర్లు : బీఆర్‌ఎస్

మంగపేట, ఆగస్టు 28: మండలంలోని గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా సమన్వయకర్త తాటి కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు ఎక్కువ బకెట్లు వేస్తూ ఓవర్ లోడ్‌తో లారీలను పంపిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. అమాయక గిరిజన సొసైటీలను అడ్డు పెట్టుకొని ఇసుక క్వారీలు నిర్వహిస్తూ అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేదంటే దశల వారీ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మంగపేట సహకార సంఘం అధ్యక్షుడు తోట రమేష్, వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ యాదవ్, డైరెక్టర్లు సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావు గుప్తా, నర్సయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఘనంగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ సేవలో అర్చకులు

మహదేవపూర్, ఆగస్టు 28: శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ రామాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారి ఉత్సవ మూరులకు బుధవారం పల్లకీ సేవను నిర్వహించారు. అనంరతం ప్రధాన ఆలయ రాజగోపురం ముందు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య నిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రామాలయంలో హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఉట్టిని కొట్టిన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డికి 1,016 బహుమతిని ఆలయ అధికారులు అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

కాకతీయఖని, ఆగస్టు 28: భూపాలపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేనేజర్ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు 9959226707 నంబర్‌ను సంప్రదించి సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి, ఆగస్టు 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి మండలంలోని ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్, సపోట, ఆయిల్‌పామ్, బత్తాయి, అల్లనేరేడు వంటి పండ్లతోటలు పెంచాలనుకునే ఎస్సీఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, ఐదెకరాలలోపు ఉన్న పట్టాదారులు, బోరుబావి, విద్యుత్ సౌకర్యం కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. రైతులు దరఖాస్తు పత్రంతోపాటు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో గ్రామపంచాయతీ కార్యదర్శి ఏఈవో, ఏపీవోకు సమర్పించాలని సూచించారు.

హైడ్రాను విస్తరింపజేయాలి

ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 28: హైదరాబాద్‌లో చేపట్టిన హైడ్రా వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, పట్టణాలకు విస్తరింపజేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చెరువులు, కుంటల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేయడం శుభపరిణామమని, ఈఅంశంలో సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలంటే హైడ్రా వంటి స్వతంత్ర వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు విస్తరింపజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

● మహదేవపూర్: హైడ్రా ఒక హైదరాబాద్‌లో కాకుండా మండల కేంద్రంలో కూడా విస్తరింపజేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలో హైడ్రాను విస్తరింపజేసి చెరువులు, నాళాలు కబ్జా చేస్తున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల కబ్జాపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

టీపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 28: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ములుగు మండల నూతన కమిటీని బుధవారం ములుగులో జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైనాల స్వామి, ఉపాధ్యక్షులుగా సబ్బాని రవీందర్, పోరిక రఘురాంనాయక్, బానోతు భద్రునాయక్, ప్రధాన కార్యదర్శిగా పాల ఉప్పస్వామి, కార్యదర్శులుగా బజ్జూరి రమేష్, కొత్తపల్లి కేదారి, పొగాకుల రతన్‌కుమార్, ఆడిట్ కన్వీనర్‌గా భూక్య గోపిసింగ్, జీవో కమిటీ కన్వీనర్‌గా మంకిడి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఐటీడీఏ కేంద్రంగా గిరిజన కమిటీ

ఏటూరునాగారం, ఆగస్టు 28: ఏటూరునాగారం ఐటీడీఏ కేంద్రంగా నూతన గిరిజన గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో జరిగిన సమావేశంలో గండేపల్లి సత్యం సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గండేపల్లి సత్యం, ఉపాధ్యక్షులుగా జగన్నాథం, నాగసాగర్, బలరాం, ఈక మహాలక్ష్మి, సుల్తాన్, లావణ్య, ప్రధాన కార్యదర్శిలుగా కొప్పుల సరిత, తెల్లం నాగమణి, పలకగంగ, ప్రచార కార్యదర్శులుగా కేంసర్తి రమేష్, భరత్, జాక రాజు, గౌరవ సలహాదారులుగా ఈసం రామ్మూర్తి, గండేపల్లి నర్సయ్య, కమిటీ సభ్యులుగా ఆర్‌కె. సమ్మయ్య, కిరణ్, హరీశ్‌ను ఎనుకున్నారు.

ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలలకు పంపాలి

గోవిందరావుపేట, ఆగస్టు 28: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, డీసీఈబీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను తిరిగి పాఠశాల విధులకు పంపాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకుడు చాప బాబు డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం మండలంలోని చల్వాయిలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు వాటిని తుంగలో తొక్కుతున్నారని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, పరీక్షల బోర్డులో కొందరు ఉపాధ్యాయులతో ఏళ్లతరబడి డిప్యూటేషన్ల పేర పనిచేయించుకుంటున్నారని ఆరోపించారు. దీంతో ఆయా పాఠశాలల్లో సరైన సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు విద్యాపరంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి డిప్యూటేషన్లపై పనిచేస్తున్న ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలలకు పంపాలని కోరారు. లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈసమావేశంలో జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు వాసుదేవరెడ్డి, ఆదిరెడ్డి, హట్కర్ సమ్మయ్య, నరేంద్రకుమార్, పోడేటి సమ్మయ్య, పల్లె నాగరాజు, జక్కుల వెంకటస్వామి, చంద్రారెడ్డి, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

దసిలీపట్టు నిర్వహణపై అవగాహన

మహదేవపూర్, ఆగస్టు 28 : మండల కేంద్రంలోని టస్సర్ కాలనీలో బుధవారం దసిలి, పట్టు దారం వెలికి తీయడంపై కేంద్ర పట్టు పరిశ్రమల అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పట్టు పరిశ్రమల జిల్లా అధికారి సమ్మయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శాస్త్రవేత్తలు, అధికారులు కాలనీలోని 47 మగ్గాలు నేచే వారికి టస్సర్ యూనిట్ రీలింగ్ మిషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ధర్మవరం నుంచి సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులు అశోక్, గుప్తా, చెన్నూరు నుంచి భగవాన్, జేబీ పట్నాయక్ శాస్త్రవేత్తలు దసిలిపట్టు నేచే విధానాన్ని కొత్త మిషన్‌పై చూపించారు. కరెంట్ లేకున్నా బ్యాటరీతో మిషన్ నడుస్తుందని వివరించారు. వీవర్స్ తక్కువ సమయంలో ఈ మిషన్ ద్వారా ఎక్కువ దసిలిని దారాన్ని తీయొచ్చని తెలిపారు.

విరిగిపడ్డ కొమ్మను ఢీకొని పలువురికి తీవ్రగాయాలు

కాటారం, ఆగస్టు 28: మండలంలోని 353(సీ)జాతీయ రహదారిపై మేడిపల్లి అటవీప్రాంతంలో గాలివానకు విరిగిపడ్డ చెట్టు కొమ్మ రోడ్డుపై పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల క్రితం చెట్టు విరిగిపడగా తొలగించకపోవడంతో పలువురు ఢీకొని గాయాలపాలయ్యారు. సోమవారం రాత్రి ఒకరు బైక్‌తో ఢీకొని అదుపుతప్పి గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. మంగళవారం రాత్రి మరొకరు కొమ్మకు ఢీకొట్టి గాయాలయ్యాయి. అధికారులు స్పందించి రోడ్లపై విరిగిపడ్డ చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం కోసం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. వైటీసీలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కాటారం మండలంలోని గంగారంలో ఐటీఐ, టీజీఐఐసీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు కేటాయించిన పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి భూమి కేటాయించామని, వెంటనే పనులు ప్రారంభించాలని, రెండు రోజుల్లో పనులు మొదలు కాకుంటే నివేదికందించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలకు ఇంటి నంబర్లు కేటాయించొద్దని డీపీవోకు సూచించారు. కొత్తపల్లిలో రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, సర్వేయర్లు చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు ఆదేశాలిచ్చారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కలియతిరిగి రికార్డులను పరిశీలించి రోగులను వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జ్వరాల నియంత్రణకు ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలన్నారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కస్తూర్బా విద్యాలయం, గిరిజన సంక్షేమ బాలికల గురుకులాన్ని తనిఖీలు చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు.

కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, ఆర్డీవో మంగిలాల్, ఐటీడీఏ డీడీ పోచయ్య, ఏపీవో కొండల్‌రావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఆర్ఐ వెంకన్న, సర్వేయర్స్ శ్రీనివాస్, వినయ్, ప్రిన్సిపాల్స్ సునీత, శైలజ తదితరులు ఉన్నారు.

పుస్తకాలు వితరణ చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 28: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులు తమ వద్ద నిరుపయోగంగా ఉన్న పుస్తకాలను గ్రంథాలయానికి విత రణగా ఇవ్వాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వ సభ్య సమా వేశం కలెక్టరేట్‌లో బుధవారం జరిగింది. ఈసంద ర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యాదానం మహా గొప్పదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు పేదలకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాలకు అందించాలన్నారు. ఈకార్యక్ర మంలో డీపీవో నారాయణరావు, డీపీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరైన న్యాయం చేస్తేనే భూములు ఇస్తాం

ఆర్డీవోకు తేల్చి చెప్పిన రైతులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 28: మల్హర్ మండలం నుంచి చెల్పూరులోని జెన్‌కో వరకు చేపట్టిన కన్వేయర్ బెల్టు నిర్మాణంలో తమ విలువైన భూములు పోతున్నాయని, సరైన న్యాయం చేస్తేనే వాటిని ఇచ్చేందుకు ముందుకు వస్తామని పలు గ్రామాల రైతులు తేల్చి చెప్పారు. భూపాలపల్లిలో ఆర్డీవో మంగిలాల్‌ను కలిసి తమకు ఎదురవుతున్న సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొంపెల్లి, సీపెల్లి, మహబూబ్‌పల్లి, గంధ్రపల్లిలో ఉన్న వ్యవసాయ భూములు కన్వేయర్ బెల్ట్ నిర్మాణంలో పోతున్నాయని వివరించారు. ఈ భూమిలపైనే ఆధారపడి తాము జీవనాన్ని సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా పత్తి, మిర్చి పంటలు వేసుకుంటున్నట్లు వివరించారు. కన్వేయర్ బెల్టు మూలంగా భూములు పోవడంతో పాటు చుట్టు పక్కల ఉన్న భూములను సైతం సాగు చేసుకునే పరిస్థితి ఉండదన్నారు.అధికారులు పూర్తి స్థాయిలో హామీ ఇస్తేనే భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తామని అన్నారు. ఆర్డీవోను కలిసిన వారిలో రైతులు రొంటాల విప్లవ్‌రెడ్డి, తిరుపతి, సమ్మయ్య, కాయిత తిరుపతి, వేవల మల్లయ్య, గజ్జి ఓదేలు తదిత రులు ఉన్నారు.

బ్యాంకు ఎదుట ఆందోళన

ఏటూరునాగారం, ఆగస్టు 28: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదుట రొయ్యూరు, శంకరాజుపల్లి, ఏటూరునాగారం గ్రామాలకు చెందిన రైతులు, ఖాతాదారులు బుధవారం ఆందోళనకు దిగారు. బ్యాంకు అధికారులు సమయపాలన పాటించడం లేదని, దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, ఖాతాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.